

కాలనీ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

## గాంధీనగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

**హైదర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యను త్వరలో పరిష్కరిస్తానని కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తెలిపారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆయనను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు వివరించారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ ఆయా విభాగాల అధికారులతో ఫోన్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ భాస్కర్, ప్రభాకర్, లావణ్య, రమాదేవి, బాలస్వామిసాగర్, సన్యాసిరావు, మల్లేశ్, శ్రీనివాస్, మహేష్, మధురెడ్డి, కుమార్, అజయ్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న కేఎం ప్రతాప్‌గౌడ్, నాయకులు

## ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా: ప్రతాప్‌గౌడ్

**జీడిమెట్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):** ఆలయాల అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని రంగారెడ్డి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేఎం ప్రతాప్‌గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని మాణిక్యనగర్‌లో కామాక్షి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ స్లాబ్ విస్తరణ పనులను యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌గౌడ్ మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం ఈ ఆలయ నిర్మాణంలో తనవంతు సాయం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాణిక్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.మహేష్, ప్రధాన కార్యదర్శి కలీమ్, ఉపాధ్యక్షుడు నాగరాజు, మధు, రాజేష్, సురేష్, రఘునాథ్ పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్, స్థానికులు

## పన్నులు తగ్గించాలని ధర్నా

**నిజాంపేట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):** బాచుపల్లిలో పెంచిన ఇంటి, నీటి పన్నులను వెంటనే తగ్గించాలంటూ 17వ డివిజన్ కార్పొరేటర్ ఆగం రాజు ఆధ్వర్యంలో స్థానికులు మున్సిపల్ వార్డు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పన్నులు తగ్గించని పక్షంలో తమ ఆందోళన మరింత ఉధృతంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కార్పొరేటర్ ఆగం పాండు, కాసాని సుధాకర్, బాలాజీ నాయక్, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గుర్తింపులేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

**చందానగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి మండల పరిధిలోని గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం సభ్యులు సోమవారం విద్యాధికారి వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని సంఘం అధ్యక్షుడు ఆచార్య, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

## కేంద్రంలో బీసీశాఖ లేకపోవడం బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

**దుండిగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు కేంద్రంలో మంత్రిత్వశాఖ లేకపోవడం, బీసీ వ్యక్తి ప్రధానిగా ఉన్నా బీసీలకు శాఖ లేకపోవడం బాధాకరమని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. సోమవారం బీసీ సంఘం సభ్యులతో కలిసి కొంపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంట్‌లో బీసీబిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ గణన త్వరగా పూర్తి చేయాలని కోరారు. బీసీల అభివృద్ధి కోసం బీసీ ప్లాన్ అమలు చేసి రూ.20 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. సమావేశంలో బీసీ ఐక్య వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ దశరథం, బీసీ ఐక్య వేదిక గ్రేటర్ అధ్యక్షుడు రాజేశ్‌కుమార్, జంగిల్ నిఖిల్, ప్రశాంత్, క్రాంతి తదితరులు ఉన్నారు.

## భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని వ్యక్తి ఆత్మహత్య

**జీడిమెట్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):** ఆర్థిక ఇబ్బందులు, భార్య చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోయిందని బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఇస్లాం(22) ఆరు నెలల క్రితం కుటుంబసభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం వలస వచ్చి నగర శివారులోని అపర్ణ గ్రీన్‌హోమ్స్‌లో భవన నిర్మాణంలో రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. అదే ప్రాంతంలో రేకుల షెడ్డు వేసుకుని ఉంటున్నాడు. రెండు నెలల క్రితం ఇస్లాం భార్య అతడికి చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోయింది. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెందిన అతడు రేకుల షెడ్డులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కార్మికులు, భవన నిర్మాణ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం



ప్రసాద్

**మియాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ప్రజయ్ మెగా పోలీస్‌లో నివాసం ఉండే కేవీ ప్రసాద్ టెక్‌మహేంద్రలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కార్యాలయానికి వెళ్తున్నట్లు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు విచారించగా కార్యాలయానికి రాలేదని తెలిపారు. అతడి కోసం తెలిసిన వారి ఇళ్లల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియపోవడంతో కుటుంబీకులు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.




మాడభూషి శ్రీధర్ దంపతులను సత్కరిస్తున్న సత్యవాణి తదితరులు

## మాడభూషి శ్రీధర్ దంపతులకు పురస్కారం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** సంఘసేవకురాలు నడింపల్లి యమునా పాఠక్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ఉగాది పురస్కారాలు-24 ప్రదానం సభ సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ మాడభూషి శ్రీధర్, వేదకళ్యాణి తదితరులకు అర్ధనారీశ్వరం, సేవా శ్రేష్ఠ అవార్డులు బహూకరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జి.సత్యవాణి మాట్లాడుతూ.. వివిధ రంగాల వారిని ఎంపిక చేసి అవార్డులు ఇచ్చి సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐ ఫోకస్ మిషన్ చీఫ్ కో-ఆర్డినేటర్ కె. వాసుదేవశర్మ, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

# సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

**గాజులరామారం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):** మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, అవిజే జేమ్స్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### నామినేషన్‌కు తరలిన నాయకులు

**నిజాంపేట్:** మేడ్చల్ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షుడు రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు, మహిళలు తరలివెళ్లారు. వీరంతా బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి తరలారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మేడ్చల్, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

### ● బీజేపీ ప్రచారం



చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డికి మద్దతుగా గచ్చిబౌలి టెలికాం నగర్‌లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు ధర్మగారి రవీందర్‌రెడ్డి, దినేష్ యాదవ్, ప్రవీణ్ రవీందర్ తదితరులు

\- రాయదుర్గం, ఆంధ్రజ్యోతి

## వర్ధమాన గాయనీమణులకు విజయలక్ష్మి స్ఫూర్తి

**చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** వర్ధమాన గాయనీమణులకు సింగింగ్ స్టార్ విజయలక్ష్మి స్ఫూర్తిగా నిలుస్తారని సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ అన్నారు. శ్రీ మహాలక్ష్మి మెలోడీస్ ఆధ్వర్యంలో గాయని మహాలక్ష్మి సమర్పణలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో మధుర గాయని, కలైమామణి ఎస్.జానకి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ప్రముఖగాయని విజయలక్ష్మికి ఎస్.జానకి పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదాన సభ ఈ సందర్భంగా నిర్వహించారు. పురస్కారం, అవార్డును బహూకరించిన అనంతరం దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. విజయలక్ష్మి గానం ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో ఓంకార్‌రాజు, లంక లక్ష్మీనారాయణ, గుడిబండి వెంకటరెడ్డి, వెంకట్‌రావు, మురళీధర్, వినోద్‌గౌడ్, నిర్వాహకుడు సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గాయనీగాయకులు ఆలపించిన గీతాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి.

## ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్ మాదిగ



మహేష్

**ఎర్రగడ్డ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోటిక మహేష్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎంఆర్‌పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ నియామక పత్రాన్ని బోటిక్ మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బోటిక మహేష్ మాదిగ మాట్లాడుతూ జిల్లాలో ఎంఆర్‌పీఎస్ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.




విజయలక్ష్మికి పురస్కారం అందజేస్తున్న దైవజ్ఞశర్మ తదితరులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పల్లవి ఝువార్, శ్రీలక్ష్మీరెడ్డి

## మూమెంట్స్ టు మెమోరీస్ పుస్తకావిష్కరణ

**రాయదుర్గం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** సంతోష కరమైన సంతాన సాఫల్యత, చక్కటి జీవిత అడుగలకు మార్గనిర్దేశంగా మూమెంట్స్ టు మెమోరీస్ పుస్తకం నిలుస్తుందని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో సోమవారం మూమెంట్ టు మెమోరీస్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. హ్యాపీ వ్యాల్యూయేషన్ రచయిత, వ్యవస్థాపకురాలు పల్లవి ఝువార్ రచించారు. కుటుంబ జీవిత సారాంశాన్ని ఈ పుస్తకం అందిస్తుందని వారు కొనియాడారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కీస్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఫౌండర్, డైరెక్టర్ శ్రీలక్ష్మీరెడ్డి, శ్రీరామ్ హైదరాబాద్ స్కూల్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ సింధూర ఇందుకూరి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## రూ.5.50 లక్షల నగదు స్వాధీనం

**హైదర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** జేఎన్‌టీయూ ఫోరంమాల్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఈసీ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 5 లక్షలా 50 వేలా 290 రూపాయల నగదును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. రైటర్ సేఫ్‌గార్డ్ వెహికల్ (డబ్బురవాణావాహనం) టీఎస్ 09యుడి4039లో అజయ్‌కుమార్, కృష్ణ, సాయికుమార్, కుమారస్వామి డబ్బు తరలిస్తున్నారు. తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఆ డబ్బుకు సంబంధించిన పత్రాలను చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



పాపిరెడ్డికాలనీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చందానగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ జెరిపేటి జైపాల్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో పాపిరెడ్డికాలనీ, బాంబే గృహసముదాయాల్లో ప్రచారం చేశారు. కాం గ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు వివరించారు.

## ఇంటింటి ప్రచారం విస్తృతంగా చేపట్టాలి

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల ప్రచారంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీల్లో ఇంటింటి ప్రచారం ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన స్థానిక కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి సాధన కోసం పార్లమెంట్‌లో గళం విప్పేందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రజలను విజ్ఞప్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ఈనెల 24న నిర్వహించనున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ ర్యాలీని విజయవంతం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.



ప్రచారంలో బీజేపీ నాయకులు, డాక్టర్ ఎస్.మల్లారెడ్డి

## బౌరంపేటలో ఈటల ప్రచారం

**దుండిగల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):** దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట గ్రామంలోని 38వ బూత్‌లో ఈటల రాజేందర్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మరోసారి మోదీ సర్కార్‌రావాలని, అవినీతి రహిత పాలనే బీజేపీ లక్ష్యమన్నారు. దేశ భద్రత, ఐదు వందల సంవత్సరాల కల, రామమందిర నిర్మాణం గుర్తు చేస్తూ, ఓటర్లను కలుస్తూ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహాచారి, జంగారెడ్డి, సీతారామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాము ఉన్నారు.

## రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

**నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన**

**గరిడేపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):** రైలు కింద పడి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, మిత్రులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం లుంబాతండాకు చెందిన గుగులోతు బాలు కుమారుడు విజయ్ (22) నగరంలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ డయాలసిస్ కోర్సు చేస్తున్నాడు. మిత్రులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లో రూంలో ఉంటున్నాడు. శనివారం స్నేహితులకు చెప్పకుండా బయటికి వెళ్లాడు. రూంలో అతడి బ్యాగు లేకపోవడంతో స్నేహితుడు విజయ్ విజయ్ ఇంటికి ఫోన్ చేసి సమాచారం అందించారు. విజయ్ ఇంటికి రాకపోయేసరికి ఆదివారం ఉదయం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో విజయ్ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తన మృతికి ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాశాడు. తన స్నేహితులు, కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టొద్దని రాశాడు. 'నేను జీవితంలో ఏమీ సాధించలేనని, నా చావుకు నేనే కారణం' అని రాశాడు. సోమవారం ఉదయం మిర్యాలగూడ రైల్వేఅధికారులు పోలీసులకు, ఉత్తరంలోని ఫోన్ నంబర్ల ఆధారంగా విజయ్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.

## ఉల్లిపాయల బస్తాల మాటున పత్తి విత్తనాల రవాణా

**రూ.19.20 లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం**

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** ఉల్లిలోడు కింద నిషేధిత బీటీ 3 హెచ్‌టీ పత్తి విత్తనాలను రవాణా చేస్తున్న ఇద్దరిని మేడ్చల్ ఎస్ఓటీ, షామీర్‌పేట పోలీసులు కలిసి పట్టుకున్నారు. రూ. 19.20 లక్షల విలువైన నిషేధిత విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల బెల్లంపల్లికి చెందిన గడ్డం శ్రీకాంత్(38), గోదావరి ఖనికి చెందిన గోషిక నవీన్‌కుమార్(31) డ్రైవర్లు, వారు మందమర్రికి చెందిన మినీట్రక్ యజమాని పిండి సురేష్ వద్ద పనిచేస్తున్నారు. సురేష్ ఆదేశాల మేరకు పత్తి విత్తనాలను తెచ్చేందుకు ఇద్దరు కర్ణాటక కొప్పలి జిల్లా కుస్తగిరి ప్రాంతానికి వెళ్లారు. అక్కడి ఓ వ్యక్తి నుంచి విత్తనాలు తీసుకున్నారు. అనుమానం రాకుండా ఉండేందుకు ఉల్లిపాయలు కొనుగోలు చేసి వాటిపై ఉంచారు. విత్తనాలు, ఉల్లిపాయలు లోడు చేసుకొని మంచిర్యాల బయలుదేరారు. పక్కా సమాచారంతో షామీర్‌పేట ఆరెంజ్‌బౌల్ రెస్టారెంట్ వద్ద నిఘా పెట్టిన మేడ్చల్ ఎస్ఓటీ, షామీర్‌పేట పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. 1200 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు, 1560 కిలోల ఉల్లిపాయలు, బొలేరో క్యారేజ్ వాహనం రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# ఫుట్‌పాత్‌లు, ఆటోల్లో నిద్రిస్తున్న వ్యక్తులే టార్గెట్

**స్నాచింగ్. దొంగతనాలు చేస్తున్న ముగ్గురి అరెస్ట్**

**రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.1,600 నగదు స్వాధీనం**



ముగ్గురు దొంగలను అరెస్టు చేసిన నల్లకుంట పోలీసులు

**రాంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):** రాత్రివేళ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై, ఆటోల్లో నిద్రపోతున్న వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను నల్లకుంట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి కత్తి, త్రిశూల్, బ్లేడ్, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 1,600 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నల్లకుంట పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓయూ ఏసీపీ జగన్ నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు లాలాగూడ సీఐ రమేష్‌గౌడ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. బోరబండ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో నివసిస్తున్న కల్మేర రమేష్, పెండల వెంకటస్వామి, కమ్మగోని కార్తీక్‌గౌడ్ ముఠాగా ఏర్పడ్డారు. రాత్రివేళ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లు, ఆటోలలో నిద్రిస్తున్న వ్యక్తులను బెదిరించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, డబ్బులు, వాహనాలను దొంగిలిస్తున్నారు. వాటిని అమ్మి జల్సా చేస్తున్నారు. రాయదుర్గం ఆజుబా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఎస్. నందకుమార్ ఈనెల 13వ తేదీ రాత్రి మద్యం తాగి బైక్‌పై వెళ్తున్నాడు. మెట్టుగూడ మెట్రో స్టేషన్ వద్దకు వెళ్లగానే బైక్ నడపడం వీలుకాకపోవడంతో బస్టాప్‌లో బైక్ పార్క్ చేసి నిద్రపోయాడు. కొద్దిసేపటి తర్వాత లేచి చూడగా పార్క్ చేసిన బైక్. జేబుల్ సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 17న తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో రమావత్ రాజు అనే వ్యక్తి నల్లకుంట మోడల్ రైతు చికెన్ బజార్ వద్ద ఫుట్‌పాత్‌పై నిద్రపోయాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు యాక్టివాపై వచ్చి అతడిని కత్తితో బెదిరించి కీ ప్యాడ్, మొబైల్, రూ. 3 వేలు అపహరించారు. బాధితుడు నల్లకుంట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బోరబండలో కల్మేర రమేష్, పెండల వెంకటస్వామి, కమ్మగోని కార్తీక్‌గౌడ్‌ను పట్టుకున్నారు. ముగ్గురూ మూడేళ్ల నుంచి దొంగతనాలు చేస్తున్నారని ఏసీపీ తెలిపారు. వెంకటస్వామి 16 నెలలు జైలుశిక్ష అనుభవించాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మరలా దొంగతనాలు చేస్తున్నాడని తెలిపారు. ఎస్ఆర్‌నగర్, లాలాగూడ, నల్లకుంట, జీడిమెట్ల, కూకట్‌పల్లి పీఎస్‌ల పరిధిలో చోరీలు చేశారన్నారు. వీరిపై ఆర్మ్ యాక్ట్ నమోదు చేశామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు కృష్ణ, శ్రీనివాసరావు, రమాదేవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందికి రివార్డు ఇవ్వనున్నట్లు ఏసీపీ జగన్ ప్రకటించారు.

# బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



ఇంటింటికీ కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

**దుండిగల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):** బీజేపీ, కాంగ్రెస్ జాతీయ పార్టీలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని ఎంఎం గార్డెన్స్‌లో దుండిగల్ మున్సిపాలిటీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి నియోజవర్గానికి చేసిందేమీ లేదన్నారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గతంలో కొండంగల్‌లో ఓడిన రేవంత్‌రెడ్డిని మల్కాజిగిరి ప్రజలు ఎంపీని చేస్తే నియోజకవర్గంలోని ఏఒక్క ప్రాంతానికీ రూపాయి కేటాయించ లేదన్నారు. దుండిగల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బుచ్చిరెడ్డి, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ నాగరాజు యాదవ్, మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు.

● **షాపూర్‌నగర్:** బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సోమవారం సూరారం డివిజన్ పరిధిలోని మార్కెండేయ నగర్‌లో ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ మంత్రి సత్యన్నారాయణ, డివిజన్ అధ్యక్షుడు, సీనియర్ నాయకులతో కలసి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● **గాజులరామారం:** గాజులరామారం డివిజన్‌లోని మెట్కాన్‌గూడ, మారుతీనగర్, పెద్దమ్మగుడి బస్తీల్లో కార్పొరేటర్, నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొన్నారు.

● **కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి మాణిక్యనగర్‌లో ఎమ్మెల్యే మాజీ కార్పొరేటర్ కేఎం. గౌరీష్‌తో కలిసి బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తరపున సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

● **దుండిగల్:** దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని వినాయకనగర్‌లో నూతనంగా నిర్మించిన విజయ గణపతి దేవస్థానంలో గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై స్వామి వారికి ప్రత్యే పూజలు నిర్వహించారు. కౌన్సిలర్, ఆలయ ధర్మకర్త సగ్గిడి సత్యనారాయణ ఉన్నారు.